క్లుప్తంగా

డీఎంహెచ్ఓ పరిశీలన



విద్యార్థితో నులిపురుగు నివారణ మాత్రను వేయిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ: మండలంలోని అన్నవరం దగ్గరున్న డీఏవీ స్కూల్, తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం చేపట్టిన నులిపురుగు నివారణ మాత్రల పంపిణీని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్లలోపు వయసు వారందరికీ డీవార్మింగ్ టాబ్లెట్లు(నులిపురుగు నివారణ మాత్రలు) వేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో శతశాతం డీవార్మింగ్ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ డిప్యూటీ ఈఓ సందర్శన



మాట్లాడుతున్న టీటీడీ డిప్యూటీ ఈఓ మునిభూషణ్ రెడి

సీతంపేట: మండల కేంద్రంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీ డిప్యూటీ ఈఓ మునిభూషణ్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో ఇక్కడ మహా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులంతా ప్రశాంతంగా భగవంతుని దర్శనం చేసుకునేలా ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇక్కడే ఓ మినీ కల్యాణ మండపం కూడా నిర్మిస్తున్నామని, 95 శాతం పనులు కూడా పూర్తయ్యాయన్నారు.

వేతనదారులందరికీ పని కల్పించాలి



వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారునికి ఉపాధి పని కల్పించాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని తురకనాయుడువలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా పనిచేయాలని, నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పని చేసిన వారికే మస్తరు వేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ: స్థానిక నగరపంచాయతీ పరిధిలో స్వచ్ఛత-2023 అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. పారిశుద్ధ్య పనులు, చెత్తసేకరణ, నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారంతా అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 22న బహుమతులు అందిస్తామన్నారు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు



పరీక్ష కేంద్రం సందర్శనలో ఆర్ఐఓ తవిటినాయుడు

పాలకొండ: పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు తెలిపారు. శనివారం స్థానిక పట్టణంలోని ఎలైట్ జూనియర్ కాలేజీలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను పరిశీలించిన ఆయన పరీక్షలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎక్కడా ఎటువంటి కాపీయింగ్ జరగకుండా ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

రోజుకు రూ.257 వేతనం



చింతాడలో వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. శనివారం మండలంలోని చింతాడ, గోపాలపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా పనులు చేయాలని, వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అప్రమత్తతే పశువులకు రక్ష



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

- గాలికుంటు వ్యాధి బారిన పశువులు
- వ్యాధి సోకిన పశువుల్లో తగ్గుతున్న పాలదిగుబడి
- కొన్నిసార్లు మూగజీవాలు మరణించే ప్రమాదం కూడా..
- అప్రమత్తం కాకుంటే నష్టం తప్పదంటున్న వైద్యులు

భామిని: పశుసంపద మానవాళికి అన్ని విధాలా మేలు చేస్తుంటుంది. ఈ నేపథ్యంలో వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉంది. కాలం, వాతావరణం మారుతున్నప్పుడు మనుషుల మాదిరే పశువులు కూడా సీజనల్ వ్యాధులు వేధిస్తుంటాయి. ప్రస్తుతం ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలను గాలికుంటు వ్యాధి తీవ్రంగా బాధిస్తోంది. దీని ప్రభావంతో పాలఉత్పత్తి, దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. ఒక్కోసారి ఈ వ్యాధి బారినపడిన పశువులు కూడా మరణిస్తున్నాయి. దీంతో పశుపోషకులు, పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ముందస్తు జాగ్రత్తగా అందుబాటులో ఉన్న గాలికుంటు నివారణ టీకాలు పశువులకు వేయిస్తే వ్యాధి నివారించవచ్చని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి ఏటా ఏడాదిలో రెండుసార్లు టీకాల పంపిణీ(వ్యాక్సినేషన్) చేపడుతుండం గమనార్హం కాగా, ప్రస్తుతం అంతటా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. రైతులు అప్రమత్తమై వ్యాధి సోకిన పశువులతో పాటు వ్యాధి సంక్రమించని వాటికి కూడా ముందస్తుగా టీకాలు వేయాలని అధికారులు కోరుతున్నారు.

మండలం	ఆవులు, గేదెలు	మేకలు, గొర్రెలు	టీకాలు వేసిన జీవులు
పాలకొండ	13,821	16,664	24,560
వీరఘట్టం	14,972	15,950	25,376
సీతంపేట	13,337	12,995	23,687
భామిని	15,028	17,370	27,972

వ్యాధి లక్షణాలు..

నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, చర్మం గరుకుగా తయారు కావడం, తీవ్రమైన జ్వరం, నోటి నుంచి చొంగ కారడం, వేడిని అంతగా తట్టుకోలేకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కుడితి తాగకపోవడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలు. ఇవి కనిపించిన వెంటనే దగ్గరలోని పశువైద్య శాలకు తీసుకువెళ్లి, వైద్యుల సలహాలు సూచనలు తీసుకోవాలి. 4 నెలల వయసు దాటిన పశువులన్నింటికీ వ్యాధి నివారణకు గాలికుంటు టీకాలు వేయించాలి. వ్యాధి తీవ్రతరమైతే పశువులు నీరసించిపోయి కదల్లేని పరిస్థితి ఎదురవుతుంది. ఒక్కోసారి ఆ స్థితికి చేరుకున్న పశువులు మరణించవచ్చు. ఈ తరహా లక్షణాలు కనిపిస్తే పశుయజమానులు అప్రమత్తం కావాలని, ఆస్పత్రులకు తరలించి, త్వరితగతిన చికిత్స అందజేయాలి.

అందుబాటులో నివారణ టీకాలు..



ప్రతీ గ్రామసచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే వ్యాక్సినేషన్ కార్యక్రమం కూడా జోరుగా కొనసాగుతోంది. వ్యాధితో బాధపడే పశువులను ఆర్బీకేలు, పశువైద్య కేంద్రాల వద్దకు తరలించి, వ్యాక్సిన్లు వేయించాలి. – పి.రమేష్, ఏహెచ్‌ఏ, ఆర్బీకే, నేరడి-బి, భామిని మండలం

అప్రమత్తం చేస్తున్నాం..



పశు యజమానులు, పోషకులను అప్రమత్తం చేస్తున్నాం. గ్రామ స్థాయి నుంచే వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేశాం. గాలికుంటు తమ దగ్గర వ్యాధితో బాధపడుతున్న మూగజీవాలకు వ్యాక్సిన్లు వేయించాలి. కాలిగిట్టల మధ్య పుండ్లు తగ్గేందుకు వేపనూనె పూయాలి. నోటి నుంచి చొంగ నివారించేందుకు బోరిక్ పౌడర్ చల్లి, గ్లిజరిన్ పూయాలి.
– బి.గౌతంప్రసాద్, పశువైద్యాధికారి, చిన్నబగ్గ

ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షలు వితరణ



మాట్లాడుతున్న దాత వైష్ణవి

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విశాఖపట్నానికి చెందిన దాతలు మునగపాటి వైష్ణవి, వెంకటవర్మ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఆలయ అభివృద్ధి డైరెక్టర్ల సమావేశంలో ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షలు వితరణ చేస్తూ చెక్కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ముమ్ముందు ఆలయ పూర్వ వైభవానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ డి. ధనుంజయరావు, కార్యదర్శి డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



పాలకొండలోని పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రజారోగ్య శాఖ ఎస్ఈ రాజారావు

పాలకొండ: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ప్రజారోగ్య శాఖ ఎస్ఈ రాజారావు తెలిపారు. శనివారం స్థానిక నగరపంచాయతీ పరిధిలోని పంప్‌హౌస్‌ను పరిశీలించిన ఆయన తాగునీటి సరఫరా, నిర్వహణపై ఆరాతీశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా జాగ్రత్త వహిస్తున్నామన్నారు. తాగునీటి వనరులను పునరుద్ధరించడంతో పాటు పాడైపోయిన బోర్ల మరమ్మతులు చేపడుతున్నామని, మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్లను బాగు చేయిస్తున్నామన్నారు. రక్షిత మంచి నీటి పథకాల ద్వారా తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట విజయనగరం ఈఈ దక్షిణామూర్తి, మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావు, డీఈఈ కె.నరసింగరావు, ఏఈ దేవీవరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది

సీతంపేట: మండల వ్యాప్తంగా కొన్నిరోజులుగా చేపడుతున్న ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. స్థానిక పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నచిన్న కంటి సమస్యలతో బాధపడుతున్న వారంతా ఆస్పత్రికి చేరుకుని, చికిత్స చేయించుకోవాలన్నారు. అందరూ చక్కని చూపు కలిగి ఉండాలన్నదే జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. దీనికోసం ఏటా గ్లకోమా వారోత్సవాలు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటరావు, రాజేష్, సీతారాం, రేఖ పాల్గొన్నారు.

20న చలో ఢిల్లీ



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలనాయుడు

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ ప్రజాసంక్షేమం, పేదల అభ్యున్నతి మరిచిందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ల ధరలు పలుమార్లు పెంచి, సామాన్యుడి నడ్డి విరుస్తోందని దుయ్యబట్టారు. నోట్ల రద్దు దగ్గర నుంచి జీఎస్టీ, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు రూపొందించి, ప్రజల వ్యతిరేకతను కూడగట్టుకున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం ప్రధాని మోదీ విస్మరించారన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో చేపట్టే ధర్నాకు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కె.రామూర్తినాయుడు, డి.అప్పలనాయుడు, బి.లక్ష్మంనాయుడు, రమణ, పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పాలకొండ రూరల్: ఉపరితల ద్రోణి కారణంగా కురుస్తున్న అకాల వర్షాలతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా మండల కేంద్రంలోని తన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు ఉంటాయన్నారు. సహాయక చర్యల కోసం ఫోన్ నంబర్ 9493341965ను సంప్రదించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొమరాడ: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.రామ్‌గోపాలరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన తొలుత అక్కడి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్, ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్, జాబ్‌మేళాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

గరుగుబిల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేయగా, ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం పాడైపోతుందన్న అపోహ అందరిలో ఉందని, అటువంటి అపోహలు వీడాలన్నారు. మనం చేసే రక్తదానం ఒకరి ప్రాణాలు రక్షించడంతో పాటు వారి కుటుంబానికి అండగా నిలవడమవుతోందన్నారు. రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్ఓ ఎ.శ్యామ్, సర్పంచ్ ఎ. సింహాచలమ్మ, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఎన్.ఎస్.ఎస్ అధికారి బి. హరిరామకుమార్ పాల్గొన్నారు.

విద్యాసామర్థ్యాలు మెరుగుపరచాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: విద్యార్థుల విద్యాసామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, విద్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందిని కోరారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులు బైజూస్ యాప్ ఎలా వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ధనుంజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థిని విద్యాసామర్థ్యం పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఏఎంఓ రాజేశ్వరి

భామిని: మండలంలోని కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలను పార్వతీపురం మన్యం జిల్లా సర్వశిక్షా అభియాన్ ఏఎంఓ ఎం.రాజేశ్వరి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నలు అడిగి పరిశీలించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి, తల్లిదండ్రులు, గురువులు, పుట్టిన ఊరుకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను గమనించి, రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ మిస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏఎస్ఓ వి.కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల శాఖ అధికారులు

పాలకొండ: యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల శాఖ ఏడీ ఐ.ధర్మారావు కోరారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదీ పరిశ్రమల శాఖ ద్వారా రాయితీపై 100 రకాల యూనిట్లు మంజూరు చేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకుని, ఉపాధి పొందాలన్నారు. సదస్సులో ఏపీ కేవీఐబీ డీఈఓ ఎస్.రవికుమార్, జేఐ డి. శ్రీహరి, డీఆర్‌డీఏ ఏపీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షం

పాలకొండ/వీరఘట్టం/భామిని/గుమ్మలక్ష్మీపురం: అల్పపీడన ప్రభావం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురవగా, మరికొన్నిచోట్ల ఈదురుగాలులు, మెరుపులతో వర్షం పడింది. గాలులకు గ్రామీణ ప్రాంతాల్లోని మొక్కజొన్న, అరటి పంట నేలకొరిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బాగా పండిందన్న సమయంలో ప్రకృతి వైపరీత్యం(అకాల వర్షం) తమ కొంప ముంచిందన్నారు.

మార్మోగిన జైదుర్గాభవానీ నామస్మరణ



కొత్తగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాభవానీ శిలావిగ్రహం



పూజలందుకుంటున్న అమ్మవారి విగ్రహాలు



కోటదుర్గమ్మ ఆలయ శిఖరంపై పూర్ణకలశం అమర్చుతున్న దృశ్యం



దుర్గాభవానీని దర్శించుకుంటున్న పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్



పూర్ణకలశ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని తిలకిస్తున్న దాతలు

జైదుర్గాభవానీ నామస్మరణతో వీరఘట్టం మార్మోగింది. మండల కేంద్రంలో మూడురోజులుగా జరుగుతున్న శ్రీకోటదుర్గమ్మ ఆలయ పునఃప్రారంభోత్సవం శనివారం ముగిసింది. ఆఖరి రోజు కావడంతో అమ్మవారి దర్శనం, పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుని, విశేష పూజలు చేశారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఉదయం గోపూజతో ఆరంభమైన పూజల్లో రత్నన్యాసం, లోహన్యాసం, ధాతున్యాసం, శేషహోమం చేపట్టారు. మధ్యాహ్నం 250 మంది(దాతలు) దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శిఖర, శేషహోమం, ఏకశిలాయుత మకరతోరణ సింహవాహన పీఠస్థిత దుర్గాభవానీ విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేశారు. ఆ తర్వాత శిఖర ప్రతిష్ట, ధ్వజస్థాపన, మహాపూర్ణాహుతి, అవభృతము, కంకణ విసర్జనము, శాంతిసూక్త పఠనం నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– వీరఘట్టం